తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి

శుక్రవారం 16 అక్టోబర్ 2026 | పేజీలు : 8

Follow :




# వరద కాలువ గట్లపై వేప చెట్ల నరికివేత

**○అధికారుల నిర్లక్ష్యంతో పచ్చదనం ధ్వంసం.. కాలువ గట్లకు ముప్పు**

**మాడుగులపల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి):** నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం మాడుగులపల్లి మండలం మాడుగులపల్లి నుండి కనేకల్ వెళ్లే దారిలో పర్యావరణ వినాశనం యథేచ్ఛగా సాగుతోంది వరద కాలువ (కెనాల్) గట్లపై ఏపుగా పెరిగి, పర్యావరణానికి ప్రాణవాయువునందిస్తున్న పెద్ద వేప చెట్లను కొందరు అసాఘిక శక్తులు అడ్డగోలుగా నరికి ధ్వంసం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులకు ఇది కంటికి కనిపించడం లేదా? లేక తెలిసి కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? అనే ప్రశ్నలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**కాలువ గట్లకు పర్యవేక్షణ కరువు.. ప్రమాదంలో రైతన్నలు**

కెనాల్ గట్ల పక్కన దశాబ్దాలుగా వేళ్లూనుకుని ఉన్న ఈ పెద్ద వేప చెట్లు కేవలం గ్రీనరీని అందించడమే కాకుండా, వరద కాలువ కట్టలకు పటిష్టమైన మద్దతుగా నిలుస్తున్నాయి. వర్షాకాలంలో లేదా సాగునీరు విడుదల చేసినప్పుడు నీటి ఉద్ధృతికి గట్లు కోసుకుపోకుండా ఈ చెట్ల వేర్లు గట్టిగా పట్టుకుని కాపాడుతుంటాయి. అయితే, కాసులకు కక్కుర్తిపడిన కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఈ భారీ చెట్లను నరికేసి పట్టుకెళ్తుండటంతో రాబోయే కాలంలో కాలువ కట్టలు బలహీనపడి భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**అధికారుల మధ్య కొరవడిన సమన్వయం? ఎవరికి ఫిర్యాదు చేయాలి?**

ఈ అక్రమ నరికివేతపై ప్రశ్నిస్తే అధికారుల నుంచి సరైన స్పందన కరువైంది. అసలు ఈ వరద కాలువ భూములు నీటి పారుదల (ఇరిగేషన్) శాఖ పరిధిలోకి వస్తాయా? లేక చెట్ల రక్షణ బాధ్యత అటవీ (ఫారెస్ట్) శాఖ చూస్తుందా? అనే కనీస స్పష్టత లేకుండా పోయింది. ఎవరికి ఫిర్యాదు చేయాలో, ఎవరిని నిలదీయాలో తెలియక తలలు పట్టుకుంటున్నాం అని రైతులు వాపోతున్నారు శాఖల మధ్య సమన్వయ లోపం ఆసరాగా చేసుకొని కొందరు అక్రమార్కులు ప్రభుత్వ ఆస్తిని, పచ్చదనాన్ని కొల్లగొడుతున్నా అధికారులు చోద్యం చూస్తుండటం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కళ్లు మూసుకుంటారా.. కఠిన చర్యలు ఉంటాయా?**

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ఈ దందాను ఇప్పటికైనా అధికారులు నిలువరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



చెట్లను నరికి రాత్రికి రాత్రే తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి, బాధ్యులపై శాఖాపరమైన మరియు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా మరియు మండల స్థాయి అధికారులు స్పందించి, క్షేత్రస్థితిని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని లేనియెడల రైతుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

## కాయకల్పలో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి రాష్ట్రస్థాయి గుర్తింపు!

**○ 86.92 శాతం స్కోరుతో ప్రశంసా పత్రం..**

**○నగదు ప్రోత్సాహకం**




**భద్రాచలం అక్టోబర్ 15 (జనంసాక్షి) :** భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాయకల్ప కార్యక్రమంలో మరోసారి సత్తా చాటింది. 2025?26 సంవత్సరానికి నిర్వహించిన రాష్ట్రస్థాయి మూల్యాంకనంలో 86.92 శాతం స్కోరు సాధించి గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా ఆసుపత్రికి ప్రశంసా పత్రంతో పాటు నగదు ప్రోత్సాహకం లభించనుంది. ఈ ఏడాది ఏప్రిల్ 18న కాయకల్ప బృందం ఆసుపత్రిని సందర్శించి పలు అంశాలపై సమగ్రంగా పరిశీలన చేపట్టింది. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, వైద్య సేవల నాణ్యత, వైద్య వ్యర్థాల నిర్వహణ, రోగులకు అందిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేసి మూల్యాంకనం చేసింది. గతంలోనూ పలు సంవత్సరాల్లో కాయకల్ప కార్యక్రమంలో గుర్తింపు పొందిన భద్రాచలం ఏరియా ఆసుపత్రి తాజాగా మరోసారి ప్రశంసలు అందుకోవడం పట్ల వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత ప్రమాణాలు, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది చేస్తున్న కృషికి ఈ గుర్తింపు నిదర్శనంగా నిలుస్తోంది.

## భద్రాచలం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలపై వివాదం!

**○ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు.. కొత్త సభ్యుల చేరికలపై సీనియర్ల అసంతృప్తి.**

**○ వ్యాపారుల ప్రయోజనాలే లక్ష్యమా.. వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యమా?**




**భద్రాచలం అక్టోబర్ 15 (జనంసాక్షి)**

భద్రాచలం పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన వేళ సంస్థలో అంతర్గత విభేదాలు, సభ్యత్వాలపై అభ్యంతరాలు తెరపైకి వస్తున్నాయి. వ్యాపార వర్గాల ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేయాల్సిన వాణిజ్య సంస్థ ఎన్నికల వ్యవహారం ఇప్పుడు సభ్యుల మధ్య చర్చకు దారితీస్తోంది. బుధవారం ఓటర్ల పరిశీలన ప్రక్రియ ప్రారంభం కాగా, ఓటర్ల జాబితా, కొత్త సభ్యుల చేరికలు, సభ్యత్వాల అర్హతలపై వ్యాపార వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటర్ల పరిశీలన (స్క్రూటీని) చేపట్టినట్లు అడ్వైజర్ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం తదుపరి ఎన్నికల షెడ్యూల్, ఇతర వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని పేర్కొన్నారు. అయితే, సీతారామ చాంబర్ ఆఫ్ కామర్స్ పేరుతో నమోదైన కమిటీ కొనసాగుతున్న నేపథ్యంలో, కొత్తగా ఏర్పాటైన అడ్వైజర్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణపై వ్యాపార వర్గాల్లో ఆసక్తితో పాటు సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**- కొత్త సభ్యుల చేరికలపై అభ్యంతరాలు..**

అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి పదవులకు సంబంధించి జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పలువురు కొత్త సభ్యులను చేర్చుకున్నట్లు తెలుస్తోంది. అయితే, కొందరి సభ్యత్వాల అర్హతలు, ఓటర్ల జాబితాలో వారి పేర్ల నమోదుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగా చేరిన సభ్యులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్న అభిప్రాయం కొందరు సీనియర్ వ్యాపారుల్లో అసంతృప్తికి కారణమవుతున్నట్లు

**వార్తా లోపలి పేజీలో**



## ప్రభుత్వ భూమిలో టేకు చెట్ల నరికివేత, కలప అక్రమ రవాణా కేసులో ఇద్దరిపై కేసు నమోదు

**కల్లూరు అక్టోబర్15( జనంసాక్షి)**

ప్రభుత్వ భూమిలో టేకు చెట్లు నరికివేత, కలప అక్రమ రవాణా సంబంధించి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలంగాణ ఆటవిశాఖతల్లాడ రేంజ్ ఎఫ్ఆర్ఓ ఉమా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో టేకు చెట్లు కలప మాయమైన సంఘటనపై ఫారెస్ట్ అధికారులు విచారణ చేపట్టగా మండల పరిధిలోని రఘునాథ గూడెం గ్రామ శివారు పంట పొలాల సమీపంలో టేకు దిమ్మలు లభ్యమయ్యాయి. ప్రభుత్వ భూమిలో పెరిగి ఉన్న టేకు చెట్లను అనుమతి లేకుండా నరికివేయడం, చెల్లుబాటు అయ్యే రవాణా అనుమతి పత్రం లేకుండా కలపను తరలించడం ప్రైవేటు వ్యవసాయ భూమిలో నిల్వ చేయడం వంటి ఆరోపణలకు సంబంధించి అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి కల్లూరు ఎంపీడీవో డి చంద్రశేఖర్, రఘునాథ గూడెం గ్రామానికి చెందిన కుక్కా రాణా, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ ఆర్ వో తెలిపారు. ప్రైవేటు వ్యవసాయ భూమిలో నిల్వ ఉంచిన టేకు కలపకు సంబంధించిన వివరాలను నమోదు చేసి, వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రకారం కలపను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు .

**వార్తా లోపలి పేజీలో**

# కాంగ్రెస్ పాలన అవినీతిమయం

## నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

**హాలియా జనం సాక్షి అక్టోబర్ 15:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్ర పాలన అవినీతిమయంగా మారిందని, నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాజీ రాష్ట్ర ట్రై కార్ చైర్మన్ రామచంద్రనాయక్ తీవ్రంగా విమర్శించారు గురువారం తన నివాసంలో ఏర్పడిన విలేకరుల సమస్యలు మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్తు విద్యుత్ ఉత్పత్తి, సరఫరా విషయంలో తీవ్ర వైఫల్యం చెందిందని తీవ్రంగా విమర్శించారు.



**విద్యుత్ రంగంలో తేడా**

2014లో ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన సమయంలో రాష్ట్రంలో 7,778 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉండగా, కేసీఆర్ పాలన ముగింపు సమయానికి అది 24 వేల మెగావాట్లకు చేరిందని భగత్ కుమార్ తెలిపారు. ఆ కాలంలో వ్యవసాయం, పరిశ్రమలు, గృహావసరాలకు 24 గంటలూ విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోయిందని, వ్యవసాయానికి ఐదు గంటల కరెంటు కూడా సకాలంలో అందడం లేదని విమర్శించారు. గృహాలు, పరిశ్రమలకు కూడా విద్యుత్ కోతలు విధించే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు.

**యాదాద్రి ప్లాంట్ వైఫల్యం**

దామచర్ల వద్ద గత బీఆర్ఎస్ ప్రభుత్వం 4,000 మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం 400 మెగావాట్ల ఉత్పత్తి కూడా సాధించలేకపోతుందని భగత్ కుమార్ విమర్శించారు. బొగ్గు సరఫరా లేకపోవడమే కారణమని సింగరేణి వర్గాలు చెబుతున్నాయని, అయితే ప్రభుత్వం సింగరేణికి రూ. 60 వేల కోట్ల బాకీ ఉందని సమాధానమిచ్చిందని ఆయన ఆరోపించారు.

విద్యుత్ ఉత్పత్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం బొగ్గు కొనే పరిస్థితి కూడా లేదని ఆయన విమర్శించారు. ఇది రాష్ట్ర విద్యుత్ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని పేర్కొన్నారు.

**సింగరేణిపై ఆరోపణలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో సింగరేణిలో పదివేల కోట్ల కుంభకోణం జరిగిందని భగత్ కుమార్ ఆరోపించారు. సింగరేణి బొగ్గు కుంభకోణంపై కాంగ్రెస్, బీజేపీలు కలిసి నాటకమాడుతున్నాయని, బీజేపీకి నిజమైన చిత్తశుద్ధి ఉంటే సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణిని ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. కార్మికులు ఉత్పత్తి చేస్తున్న బొగ్గు ఎక్కడికి వెళ్తోంది, ఎవరు దాన్ని మాయం చేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2023లో సింగరేణి 70 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసినప్పటికీ, 2025లో అది 58 మిలియన్ టన్నులకు పడిపోయిందని ఆయన తెలిపారు. ఇది ఏటేటా పెరగాల్సిన ఉత్పత్తి తగ్గడం ప్రభుత్వ నిర్వాహణ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.

**కేసీఆర్ పాలనను ప్రశంసించిన భగత్**

కేసీఆర్ పాలనలో బొగ్గు కొరత లేదు, కరెంటు కొరత లేదు, నీటి కొరత లేదని, పదేళ్ల పాటు సింగరేణి బ్రహ్మాండంగా నడిచిందని భగత్ కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుత దుస్థితికి కారణం ఎవరో ప్రజలు ఆలోచించాలని కోరారు. రాష్ట్రానికి, సింగరేణికి కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని ఆయన వ్యాఖ్యానించారు.

**ఓటర్ల నమోదుపై పిలుపు**

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన వారందరి ఓటర్ల నమోదు పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను భగత్ కుమార్ కోరారు. ప్రతి గ్రామం, బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిఆర్ఎస్ నాయకులు రి క్కల ఇంద్రసేనారెడ్డి బాబురావు నాయక్ కూరాకు వెంకటేశ్వర్ల వర్ర వెంకటరెడ్డి కర్నే నర్సిరెడ్డి రవి నాయక్ పిల్లి వెంకట్ చేగొండి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# భద్రాచలం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలపై వివాదం!

చర్చ జరుగుతోంది. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత కమిటీ అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

**- వ్యాపారుల సంక్షేమమే ప్రాధాన్యమా?**

చాంబర్ ఆఫ్ కామర్స్ అనేది వ్యాపారుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ, వాణిజ్య అభివృద్ధి కోసం పనిచేయాల్సిన సంస్థ. అలాంటి సంస్థలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగడంతో పాటు సభ్యత్వాల నమోదు, ఓటర్ల అర్హతలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలపై స్పష్టత ఉండాల్సిన అవసరం ఉంది. వ్యక్తుల ప్రయోజనాల కంటే సమష్టి వ్యాపార ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలన్న అభిప్రాయం వ్యాపార వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఎన్నికల ప్రక్రియపై నెలకొన్న సందేహాలకు తెరదించాలంటే ఓటర్ల తుది జాబితాను వెల్లడించడం, కొత్త సభ్యుల చేరికలకు సంబంధించిన వివరాలను స్పష్టం చేయడం, అభ్యంతరాలపై నిష్పక్షపాతంగా పరిశీలన జరపడం కీలకంగా మారింది. ఆరోపణలు నిజమా, అపోహలా అన్నది తేల్చాల్సిన బాధ్యత సంబంధిత కమిటీపై ఉంది. చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు కొందరి ఆధిపత్యానికి వేదికగా మారకుండా, వ్యాపారులందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించేలా నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. ఎన్నికల ప్రక్రియపై పారదర్శకతకు భరోసా కల్పించి, సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టినప్పుడే నూతన కార్యవర్గానికి నిజమైన గుర్తింపు లభిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రభుత్వ భూమిలో టేకు చెట్ల నరికివేత, కలప అక్రమ రవాణా కేసులో ఇద్దరిపై కేసు నమోదు

ప్రభుత్వ భూమి వివరాలు, చెట్ల నరికివేతకు అనుమతులు, కలప రవాణా పత్రాలు సంబంధిత వ్యక్తుల పాత్రపై తదుపరి విచారణ కొనసాగుతుందన్నారు ఈ ఘటనకు సంబంధించి తెలంగాణ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ చట్టం, 2002 తెలంగాణ ఫారెస్ట్ ప్రొడ్యూస్ (ట్రాన్సిట్ రూల్స్, 1970లోని వర్తించే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు .ప్రభుత్వ భూముల్లోని చెట్లను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. అనుమతి లేకుండా చెట్లను నరికివేయడం లేదా చట్టవిరుద్ధంగా కలపను రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడకూడదని అటవీ శాఖ తరపున ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నెల్లికల్ లిఫ్ట్ నష్టపరిహారం చెక్కులు పంపిణీ

**తిరుమలగిరి (సాగర్) అక్టోబర్ 15(జనంసాక్షి):** నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ లో భూములు కోల్పోయిన రైతులకు గురువారం నష్టపరిహారం చెక్కులను నెల్లికల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో కృష్ణపట్టి ప్రాంత గ్రామాల సర్పంచుల చేతుల మీదుగా ఆయా గ్రామాల రైతులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మిర్యాలగూడ ఆఫీస్ అధికారిని హిమ బిందు,నెల్లికల్ గ్రామ సర్పంచ్ వట్టాల శీను గౌడ్, జాల్ తండా గ్రామ సర్పంచ్ భామిని శర్మన్ నాయక్, పిల్లిగుండ్ల తండ గ్రామ సర్పంచ్ జటవత్ సక్కు నాయక్, గోదుమడక సర్పంచ్ నేనవత్ పికిలి శ్రీను నాయక్, ఎర్రచెరువు తండా మాజీ ఉప సర్పంచ్ రామావత్ రమేష్ నాయక్,నెల్లికల్ లిఫ్ట్ ప్రాజెక్ట్ ఇంచార్జ్ భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





# పశు వైద్యశాలలో అధికారుల నిర్లక్ష్యం సమయానికి ముందే తలుపులు వేస్తున్న వైనం

**మాడుగుల పల్లి అక్టోబర్ 15 (జనంసాక్షి ):** మండలంలోని కన్నెకల్ గ్రామ పశు వైద్యశాల సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ, సమయానికి ముందే ఆసుపత్రికి తాళాలు వేసి వెళుతుండటంతో మూగజీవాల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడుతున్నారు.కన్నెకల్ గ్రామంలోని ఈ ప్రాథమిక పశు వైద్యశాల కేవలం ఒక గ్రామానికి మాత్రమే పరిమితం కాకుండా, చుట్టుపక్కల ఉన్న అనేక ఆవాస గ్రామాలకు ప్రధాన దిక్కుగా ఉంది పరిసర ప్రాంతాల నుంచి పశుపోషకులు తమ అనారోగ్యంతో ఉన్న పశువులను ఆసుపత్రికి తీసుకువస్తుంటారు అయితే, ఇక్కడ అధికారుల జాడ కరువైంది. ఎప్పుడూ వచ్చేది లేదు, సకాలంలో విధులు నిర్వహించేది లేదంటూ గ్రామస్తులు, పశు పోషకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై నిత్యం ఎన్నోసార్లు విసుగు చెందుతున్నా, వారిలో ఏమాత్రం మార్పు రావడం లేదని మండిపడుతున్నారు అధికారిని వివరణ కోరగా విచిత్ర సమాధానం ఈ తంతుపై వివరణ కోరేందుకు కన్నెకల్ పశు వైద్యశాల అధికారి ఎ. శ్రీనివాస్ రెడ్డికి ఫోన్ చేయగా ఆయన నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. జాయింట్ డైరెక్టర్ ఆఫ్ యానిమల్ హస్బెండ్రీ (జెడిఎ) ఆదేశాల మేరకు తాము సమయానికి ముందే ఆసుపత్రిని మూసివేసి నల్గొండకు వచ్చామని ఆయన బదులిచ్చినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాలంటూ క్షేత్రస్థాయిలో ప్రజలను ఇబ్బంది పెట్టడం, విధులకు ఎండగట్టడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, కన్నెకల్ పశు వైద్యశాల సిబ్బంది తీరుపై సమగ్ర విచారణ జరిపి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పశువుల ప్రాణాలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి గడువు

**చింతలపాలెం(జనంసాక్షి)**



అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి ?మెట్టు వెంకటరామిరెడ్డి

వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలోని అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సామాజిక కార్యకర్త మెట్టు వెంకటరామిరెడ్డి సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా 2026 నవంబర్ 6 చివరి తేదీగా పేర్కొన్నందున,అర్హులైన ప్రతి పట్టభద్రుడు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.2023 నవంబర్ 1వ తేదీ నాటికి డిగ్రీ లేదా డిప్లమో విద్యార్హత పూర్తి చేసిన వారు ఈ ఓటరుగా అర్హుడు,ఎన్నికల నిబంధనల ప్రకారం ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని,ఈ సమాచారాన్ని ఇతర పట్టభద్రులకు కూడా తెలియజేసి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సామాజిక కార్యకర్త మెట్టు వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.



# లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత

## వివిధ గ్రామాల్లో వైభవంగా పూజలు, అన్నదానాలు

**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 15 (జనంసాక్షి ):** దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దుర్గాభవాని అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బొల్లంపల్లి గ్రామంలో వెలసిన దుర్గామాత మంటపం వద్ద మాలధారులు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. రామన్నగూడెంలోని హనుమాన్ దేవాలయం వద్ద దుర్గాదేవి నవరాత్రుల పూజ కార్యక్రమం సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి మేడిపల్లి వేణు -గౌతమి దంపతులు 5 కేజీల లడ్డు దుర్గాదేవికి బహకరించి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుంటోజు శ్రీను, జూలూరి నరేష్, నరేష్, వజ్జే సాయి, దొనకొండ శేఖర్, రమావత్ రణధీర్, సోము, శ్రీకాంత్, అల్లి నవీన్, మర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారికి భరోసా

## యువతకు స్ఫూర్తిప్రదాత, నిస్వార్థ సేవకుడు కళ్లకోటి శ్రావణ్

**ఆత్మకూరు (ఎం)జనంసాక్షి అక్టోబర్ (15)**
సమాజంలో ఎదుటివారికి సహాయం చేయాలనే గుణం ప్రతి ఒక్కరికీ ఉండదు, కానీ కొందరు తమ వ్యక్తిత్వంతో, సేవాభావంతో ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటారు. అలాంటి కోవకు చెందినవారే యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మరియు బీఆర్ఎస్ యువ నాయకులు కళ్లకోటి శ్రావణ్. పల్లెర్ల గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏ చిన్న ఆపద వచ్చినా "నేనున్నాను" అంటూ ముందుకెళ్లే నాయకుడిగా శ్రావణ్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, కష్టాల్లో ఉన్నవారికి ఆర్థికంగా మరియు మానసికంగా అండగా నిలుస్తున్నారు. కష్టకాలంలో ఉన్నవారికి భరోసా కల్పిస్తూ వారి మొఖాల్లో చిరునవ్వులు చూడటమే తన ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు.

**యువతకు దిశానిర్దేశం - భవిష్యత్తుకు బాటలు:**
కేవలం సామాజిక సేవా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, నేటి యువతను సరైన మార్గంలో నడిపించడంలో కళ్లకోటి శ్రావణ్ ఎప్పుడూ ముందుంటారు. యువత దేశానికి వెన్నెముక లాంటివారని నమ్మే ఆయన, విద్యార్థులకు మరియు యువతకు ఎల్లప్పుడూ మంచి దిశానిర్దేశం చేస్తుంటారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి ఆయన ఎంతో విలువైన సందేశాన్ని ఇస్తున్నారు:

**చెడు వ్యసనాలకు దూరం:**
నేటి యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, ముఖ్యంగా డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఆయన తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

**తల్లిదండ్రుల త్యాగాలను గుర్తించండి:**
కష్టపడి పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల ప్రేమను, వారి కన్నీళ్లను క్షణికానందాల కోసం దూరం



చేసుకోవద్దని హితవు పలుకుతున్నారు.

**ఉన్నత శిఖరాలను అధిరోహించండి:**
యువత వ్యసనాలకు బానిస కాకుండా మంచి చదువులు చదివి, ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన పిలుపునిస్తున్నారు. సమాజ సేవలో ముందుంటూ, యువతకు ఆదర్శంగా నిలుస్తున్న కళ్లకోటి శ్రావణ్ లాంటి నాయకులు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, సమాజానికి మరింత సేవ చేయాలని గ్రామ ప్రజలు, యువకులు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

# పేదల పక్షాన ఇందిరమ్మ రాజ్యం

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

## సర్పంచ్ గుగులోత్ కృష్ణా నాయక్

**నూతనకల్ అక్టోబర్ 14 ( జనంసాక్షి)**



ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతీ ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని బక్క హేమ్లాతండా గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణ నాయక్ అన్నారు. బుధువారం నూతనకల్ మండలం లోని బక్క హేమ్లాతండా గ్రామంలో సర్పంచ్ కృష్ణ నాయక్, పాత్తులోతు రవి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొని ప్రజా పాలనలో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే అవకాశం ఉన్నదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యవతి కాంగ్రెస్ నాయకులు మూడ్ చంపు నాయక్, పాత్తులోతు రవి నాయక్, పాత్తులోతు సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# డిండి ప్రాజెక్టు భూ నిర్వాసిత రైతులకు చెక్కుల పంపిణీ

**చింతపల్లి, అక్టోబర్ 15(జనంసాక్షి)**
చింతపల్లి మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన భూ నిర్వాసిత రైతులకు గురువారం మండల కేంద్రంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భూసేకరణ అధికారి (ఎల్ఏఓ) వనజా రాణి, డిటి మధర్ హుస్సేన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణయ్య , ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# మానవత్వానికి నిదర్శనం: కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి సర్పంచ్ భీమిడి ప్రదీప్ ఆర్థిక సహాయం

**చౌటుప్పల్ అక్టోబర్ 15(జనంసాక్షి)**
కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉంటూ, పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమించిన నిబద్ధత కలిగిన కార్యకర్త బాతరాజు వెంకటేష్ అకాల మరణం పార్టీకి తీరని లోటని గ్రామ సర్పంచ్, సర్పంచుల ఫోరమ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ భీమిడి ప్రదీప్ తీవ్రగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి, వారిని ఓదార్చారు. కార్యకర్త కష్టంలో ఉన్నప్పుడు అండగా నిలబడటమే నిజమైన నాయకత్వ లక్షణమని నిరూపిస్తూ, సర్పంచ్ ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెంకటేష్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, మాజీ సింగల్ విండో చైర్మన్ చెన్నైగోని అంజయ్య, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బోడిగే ఆనంద్, గ్రామ శాఖ అధ్యక్షులు చేవెళ్లి కృష్ణ, దేవాలయ కమిటీ చైర్మన్ కుర్నాల వెంకటేష్, మాజీ ఉప సర్పంచ్ గంగాధర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చొప్పరి సాయి, పిట్టల సాధనందం, మాజీ వార్డ్ సభ్యులు జ్యోతి లింగస్వామి, బత్తుల రమేష్, దేశగోని గణేష్, దేవరకొండ శ్రీకాంత్ చారి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## గడువులోపు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

## అడిషనల్ కలెక్టర్ హరి సింగ్

**నూతనకల్ అక్టోబర్ 15 ( జనం సాక్షి)**



స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా నూతనకల్ మండలం లోని పోలింగ్ కేంద్రములు 166 నుండి 171 లను అడిషనల్ కలెక్టర్ హరి సింగ్ గురువారం పరిశీలించారు. వచ్చిన క్లైములు అభ్యంతరాలను స్వీకరించి వాటిని ఎన్నికల నియమావళి ప్రకారం పూర్తి చేయాలని బూత్ లెవెల్ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించినారు. బిఎల్వో లు అందరూ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని వారు తెలిపారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఫారం 18 ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు విచారణ చేసి ఎన్నికల సంఘం ఆదేశముల మేరకు పూర్తి చేయుటకు ఆదేశించారు. మండలంలోని అందరూ పట్టభద్రులు కూడా ఫారం 18 ద్వారా నవంబర్ 6 2026 లోపు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పి శ్రీనివాసరావు, సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, ఆర్ఐ హాసన్ అలీ, జి పి ఓ లు, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# లింగగిరి పీహెచ్సీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

హుజూర్ నగర్ రూరల్, అక్టోబర్ 15 (జనంసాక్షి):
తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేడుకలు హుజూర్‌నగర్ మండలం లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. గురువారం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయ పాటలు పాడుతూ ఆడిపాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేడి సునీతరమణ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అని అన్నారు. పూలను పూజించడం ద్వారా ప్రకృతితో అనుబంధాన్ని చాటుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్, వైద్యాధికారి చందన్, 19వ వార్డు కౌన్సిలర్ వల్లభదాస్ కృష్ణ, సిహెచ్ఓపద్మ, పీహెచ్ఎన్ఓ పద్మ, నర్సింగ్ ఆఫీసర్లు రత్న మేరీ, మరియమ్మ, శివ, ఇందిరాల రామకృష్ణ, శ్రీనివాస్, వంశీ, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.



# పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్



హాలియాజనం సాక్షి అక్టోబర్ 15
నిడమనూరు మండలం, వేంపాడు గ్రామానికి చెందిన పాల్వాయి లింగమ్మ గారు మరణించడం వలన వారి నివాసానికి వెళ్లి పార్థివాదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ ఈ కార్యక్రమంలో బొల్లం సైదులు, కర్ణ నర్సిరెడ్డి, లకుమాల మధుబాబు, బిఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ ఆర్వ స్వాతి అశోక్ ,గ్రామ అధ్యక్షులు శిరసనగండ్ల మధు, పోతుగంటి వీర కుమార్, నాయకులు నడ్డి బాలరాజు, చేగొండి కృష్ణ, సైదాచారి, దొడ్డ శ్రీనివాస్, శిరసనగండ్ల రాంబాబు, పాల్వాయి మహేష్, ఆర్వ రామయ్య, పోతుగంటి వెంకటరత్నం, గూడపూరి బాలరాజు, బలుగురి వెంకన్న, పోతుగంటి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# మండల బీజేవైఎం అధ్యక్షుడిగా బాత్క నరేష్ యాదవ్

**రామన్నపేట, అక్టోబర్ 15 (జనంసాక్షి):**




రామన్నపేట మండల బీజేపీ అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి బీజేపీ పార్టీ వివిధ మోర్చాల అధ్యక్షులను నియమించారు. అందులో భాగంగా రామన్నపేట మండలం జనంపల్లి గ్రామానికి చెందిన బాత్క నరేష్ యాదవ్ ను బీజేవైఎం (భారతీయ జనతా యువమోర్చా) రామన్నపేట మండల అధ్యక్షుడిగా నియమించారు. ఈ నియామకంపై నరేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. తన ఎన్నికకు సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగిలయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కంబాలపల్లి సతీష్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందున పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానని ఆయన తెలిపారు.

# అధికారులు ఆఫీసులకే పరిమితమైతే కుదరదు!

**◆వార్డుల్లో పర్యటించాల్సిందే..**
**సమస్యలను గుర్తించాల్సిందే..**
**పరిష్కరించాల్సిందే!**
**◆19వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్ పర్సన్ సుజాత**

**మధిర, అక్టోబర్ 15 (జనంసాక్షి):** అధికారులు కార్యాలయాలకే పరిమితమైతే ప్రజా సమస్యలు కాగితాలకే పరిమితమవుతాయి. క్షేత్రస్థాయిలో అడుగుపెట్టి మూలాలను గుర్తిస్తేనే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది అని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత స్పష్టం చేశారు.పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె సూచించారు.గురువారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో ఆమె పర్యటన చేపట్టారు.ఈ పర్యటనలో వైస్ చైర్మన్ కోనధని కుమార్, ఆ వార్డు కౌన్సిలర్ యన్నం శెట్టి అప్పారావు, మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ పాల్‌తో పాటు వివిధ శాఖల కీలక అధికారులను వెంటబెట్టుకుని ఆమె వార్డులోని ప్రతి సందు,ప్రతీ గల్లీని కాలినడకన కలయతిరుగుతూ స్థానిక పరిస్థితులను, ఇబ్బందికర అంశా లను స్వయంగా పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏ సమస్య పేరుకు పోయింది? ప్రజలు ఏయే ఇబ్బందు లతో సతమతమవుతున్నారు? అనే వివరాలను కౌన్సిలర్‌ను, స్థానికు లను అడిగి తెలుసుకున్నారు.ఈ సంద ర్భంగా వార్డులో నెలకొన్న తాగునీరు, వీధి దీపాలు మరియు పారిశుధ్యం వంటి వివిధ సమస్యలపై ఆమె అధి కారులతో మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో పర్యటించి ఈ సమస్యలను మూలాల నుంచి గుర్తించాల్సిన బాధ్యత అధికారు లపైనే ఉందని తేల్చిచెప్పిన ఆమె... పేరుకుపోయిన ఈ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే, వార్డులో దెబ్బతిని పాడైపోయిన రోడ్ల దుస్థితిపై ఆమె స్పందిస్తూ.. ఆ రోడ్ల సమస్యను త్వరలోనే శాశ్వతంగా పరిష్కరిస్తామని అన్నారు.ఈ పర్యటన కౌన్సిలర్ రమణ నాయక్,వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.











## ఆటో యూనియన్‌కు బీఆర్ఎస్ నాయకుడి ఆర్థిక సాయం

**ఖమ్మం, (జనంసాక్షి) :**
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని 8వ డివిజన్ వైఎస్సార్ కాలనీకి చెందిన ఆటో యూనియన్ సభ్యులకు బీఆర్ఎస్ నాయకుడు భూక్యా అశోక్ గురువారం ఆర్థిక సాయం అందజేశారు. పండుగ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు చింతల నాగేశ్వరరావు నేతృత్వంలో సభ్యులు అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించడంతో పాటు సహకారం అందించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆయన, పండుగ ఖర్చుల నిమిత్తం తనవంతుగా నగదు సాయాన్ని యూనియన్ ప్రతినిధులకు అందజేశారు. కార్మికులకు అండగా నిలిచినందుకు ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన వాసవి మాత

**మధిర, అక్టోబర్ 15 (జనంసాక్షి):** మధిర పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో వాసవి మాత భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీ శ్రీనివాసులు శేషాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు,క ుంకుమ పూజలు ఘనంగా నిర్వహించగా, శర్మ హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీం ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు, ఆర్యవైశ్య పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయ నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులు చక్కగా చేపడుతున్నారని ప్రశం సించారు.దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న పూజా కార్య్ర కమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి కుంచంకృష్ణారావు, శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణమండపం అధ్యక్షులు కురువెళ్ళ వెంకట పురుషోత్తమరావు ( కృష్ణ), పుల్ల ఖండం సత్యనారాయణ మూర్తి,కోశాధికారి దాచేపల్లి రాము, యర్రా లక్ష్మణరావు, గార్లపాటిసత్యనారాయణ, నేరెళ్ల శ్రీనివాసరావు,కేతేపల్లి సురేష్, సముద్రాల పాపారావు, కొత్తూరునరసింహారావు, పల్లపోతు గోపాలకృష్ణమూర్తి, ఆత్మకూరు హనుమంతరావు, కాజా రమేష్, నంబూరు మురళి, పల్లపోతు నరసింహారావు,చారుగుండ్ల శ్రీనివాసరావు, కనీకిచర్ల హనుమంతరావు, నంబూరు అయ్యప్ప, వందలకు షర్మిల, అనుముల మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**బిజెపి రాష్ట్ర కార్యదర్శి మరియు ఖమ్మం జిల్లా ప్రబారి శ్రీ బద్దం మహిపాల్ రెడ్డి**



**మధిర, అక్టోబర్ 15 (జనంసాక్షి):**
వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా భారతీయ జనతా పార్టీ మధిర నియోజవర్గ స్థాయి సమావేశం గురువారం మధిరలో జరిగింది.ఎమ్మెల్సీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఖమ్మం జిల్లా ప్రభరి బద్దం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రతి ఒక్క పట్టభద్రుని కలిసి ఓటర్ల నమోదులో చైతన్యం పెంచాలని దిశా నిర్దేశం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటీశ్వరరావు మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలోని అన్ని మండలాల వ్యాప్తంగా ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి కంటెస్టెడ్ అభ్యర్థి పెరుమాళ్ళపల్లి విజయరాజు, ఎమ్మెల్సీ ఖమ్మం జిల్లా కో కన్వీనర్ చిలువేరు సాంబశివరావు, బిజెపి మధిర నియోజకవర్గ కో కన్వీనర్ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మర్సకట్ల స్వర్ణాకర్, బిజెపి మధిర మండల అధ్యక్షులు గడ్డం శ్రీహరి చౌదరి,టౌన్ అధ్యక్షులు శివరాజు సుమంత్, ఎర్రుపాలెం మండల అధ్యక్షులు అనుమోల సురేష్, చింతకాని మండలం అధ్యక్షులు కొండా గోపి, బోనకల్ మండలం అధ్యక్షురాలు తాళ్లూరి మౌనిక, ముదిగొండ మండల అధ్యక్షులు అల్లిక శ్రీకాంత్, బీజేపీ జిల్లా కార్యదర్శులు రామిశెట్టి నాగేశ్వరరావు, కుంచెం కృష్ణారావు జిల్లా కార్యవర్గ సభ్యులు గుండా చంద్రశేఖర్ రెడ్డి, నూతక్కి నరసింహారావు, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కొమ్మినేని కృష్ణారావు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పాపట్ల రమేష్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ కోటేశ్వరరావు, దోర్నాల రవీంద్ర ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిలు గరిదేపల్లి వేణు దుగ్గిదేవర మణికంఠ బీజేపీ మధిర మండల ఉపాధ్యక్షులు యలమర్తి వీరబ్రహ్మం, జడ కృష్ణ పెరుమాళ్ళపల్లి మోహన్ రావు, ఎమ్మెల్సీ మండల కన్వీనర్లు కోకన్వీనర్లు, జిల్లా పదాధికారులు మండల పదాధికారులు వివిధ మోర్చాల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.



## కామాక్షి దేవి అలంకారంలో అమ్మవారి దర్శనం

**- వైభవంగా 21వ శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు.. 2 వేల మందికి అన్నప్రసాదం**

**బూర్గంపహాడ్ అక్టోబర్ 15 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక సాకేతపురిలో వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 21వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు గురువారం కామాక్షి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా, భక్తులు వివిధ రకాల పుష్పాలతో పుష్పార్చనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, అన్నప్రసాద వితరణలో మోదుగ ఆకులతో తయారు చేసిన విస్తర్లు, స్టీల్ గ్లాసులను వినియోగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆధ్యాత్మికత, దేశభక్తిని పెంపొందించేలా భగవద్గీత ప్రవచనాలు, లలితా సహస్రనామం, హనుమాన్ చాలీసా పారాయణాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శాకంబరీ అలంకరణలో అమ్మవారికి సమర్పించిన కూరగాయలతో సుమారు రెండు వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి. సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు ఎస్. వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వై. కామేశ్వరరావు, ఇతర కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, భవానీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు కమిషనర్

**ఖమ్మం టౌన్ అక్టోబర్ (15) జనంసాక్షి**
పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు విది నిర్వహణ లో నిరంతరం అప్రమత్తంగా ఉండే పోలీస్ సిబ్బంది కంటే ఆరోగ్యం పై ప్రత్యేక చూపులనిఅన్నారు పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు.ప్రధాన్యత నిస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డా.అగర్వాల్కంటే ఆసుపత్రి సౌజన్యంతో పోలీస్ సిబ్బందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు పోలీస్ హెడ్ క్వార్టర్స్.లోఎర్పాగు. చేసిన శిబిరాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కంటే చూపు సమస్య లను ప్రారంభ దశలో గుర్తించి అవసరమైన వైద్య చికిత్స పొందడం. ద్వారా ఆరోగ్య సమస్యల ను నివారించ వచ్చని తెలిపారు పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సహాయాలు అందించారని. కంటి చూపు సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా మేరకు తదుపరి చికిత్స పొందగలరుపోలీస్ సిబ్బంది ఆరోగ్యం సంక్షేమం కోసం శాఖ తరుపున అవసరమైన వైద్య సేవలు అందించేందుకు. చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు కార్యక్రమంలో డా. పాశం మహేశ్ అడిషనల్ డి సి పి లురామానుజం.కుమారస్వామి ఏ ఆర్. ఏ సి పి లు నర్సయ్య సుశీల్ సింగ్. అర్ఐలు కామరాజు. సురేష్ శ్రీశైలం.సాంబశివరావు. పాల్గొన్నారు




# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ప్రభుత్వ విప్



**తుర్కపల్లి,అక్టోబర్ 15 ( జనంసాక్షి)**
తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామం నుండి గొల్లగూడెం గ్రామం వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ములకలపల్లి, గొల్లగూడెం గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యమును మెరుగుపరచడం ద్వారా ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తగ్గడంతోపాటు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు విద్యార్థులకు, ఉద్యోగులు, నిత్యం రాకపోకలు సాగించేందుకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారులు ఎంతో కీలకమని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్య తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోతు బులి వీరన్న నాయక్, మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి ,ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, బాల మల్లు యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కార్యాలయం వేదిక కావాలి

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**తుర్కపల్లి, అక్టోబర్ 15: (జనం సాక్షి )**
ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వేదికగా నిలవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కార్యాలయం కేవలం రాజకీయ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సమన్వయ వారధిగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తుమ్మల మమత తిరుపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ సోమల వెంకటేశం, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా కట్ట మైసమ్మ తల్లి బోనాలు

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 15 (జనం సాక్షి):**



పట్టణంలోని పెద్ద చెరువు వద్ద ఉన్న శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణం, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా గురువారం అమ్మవారి కల్యాణం, బలిహరణం, ఊరేగింపు, బోనాలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్లు పాక మల్లేష్ యాదవ్, కళ్లెం రాఘవరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వంగూరి పాండు, మండల అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, ఆలయ చైర్మన్ ముప్పిడి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు ఇబ్రహీంపట్నం అంజయ్య, గుణంగారి దినేష్ రెడ్డి, పోతగల్లు దానయ్య, కొమ్ము లక్ష్మణ్, గౌరవ సలహాదారులు బొక్క బాల్ రెడ్డి, కొయ్యడ నరసింహ, గునిగంటి మల్లేష్, చేరాల నరసింహ, ఉపాధ్యక్షులు మెరుగు బాలకృష్ణ యాదవ్, కేసారం బాల్ రెడ్డి, నల్ల నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి దొడ్డమోని దినేష్ యాదవ్, సహాయ కార్యదర్శులు సంకు నరసింహ, గోర్కంటి బాలయ్య, దొడ్డమోని ప్రభాకర్, కోశాధికారి మోటె మహేష్, వంగూరి సైదులు, కొమ్ము చంద్రయ్య, సాంస్కృతిక కార్యదర్శి సొల్లు శంకరయ్య, సహాయ సాంస్కృతిక కార్యదర్శి సైదులు సత్యనారాయణ, మెరుగు గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో అమ్మవారు

**రామన్నపేట, అక్టోబర్ 15 (జనంసాక్షి):**
దేవి నవరాత్రులలో 5వ రోజు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రామన్నపేట పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ప్రతిష్టించిన దుర్గామాత మండపాల వద్ద జరిగిన పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సిరిపురం గ్రామంలోని శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో దసరా దేవి శరన్నవరాత్రుల ఉత్సవం ఐదవ రోజు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద మంత్ర చరణ నడుమ ముందుగా గణపతి పూజ, నవగ్రహ పూజ, స్వామి వారి అభిషేకం హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అప్పం గోయల్ ధర్మపత్ని రజిత, మాజీ సర్పంచ్ మిర్యాల భాస్కర్ ధర్మపత్ని భారతమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రాపోలు రమేష్ అర్చకులు జెల్ల అంజయ్య గోపాలచార్యులు, అప్పం రాముల శాస్త్రి, చిన్నోజ్ సత్యనారాయణ, ఉపేంద్ర చారి, సింగం వినయ్ కుమార్, జెల్ల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బతుకమ్మ సంబరాలు

**సూర్యాపేట (జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని శ్రీవేదాంత భజన మందిరం వద్ద దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ఐదవ రోజు అట్ల బతుకమ్మ వేడుకలను ఆడుతూ పాడుతూ బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డల పండుగ బతుకమ్మ అని అన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే వివిధ రకాల పూలతో పేర్చి గౌరమ్మను పూజించడం గొప్ప సంప్రదాయమన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆడపడుచులందరూ భక్తిశ్రద్ధలతో బతుకమ్మ వేడుకలను నిర్వహించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సెక్రటరీ నకిరేకంటి రాజశేఖర్, అర్చకులు సింగరాచార్యులు, రాఘవాచార్యులు, సోమ అశోక్, సోమా సుమన్ ఓరుగంటి చంద్రశేఖర్, వరగాని వెంకన్న, షీలా శంకర్, కక్కిరేణి రామ్మూర్తి, రాచర్ల ప్రేమలత,నకరికంటి హైమావతి,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

సూర్యాపేట(జనంసాక్షి):
బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం వద్ద బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే ఈ పండుగ ప్రతి ఒక్కరిలో ఆనందాన్ని నింపుతుందని తెలిపారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే పండుగలను కాపాడుకుంటూ, మన సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షులు సింగిరికొండ సురేందర్, ప్రధాన కార్యదర్శి ఈగ వెంకటేశ్వర్లు, కోశాధికారి పోలా రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు సింగిరికొండ రవీందర్, దేవాలయ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే వేముల సమక్షంలో బట్టె సంతోష్ జన్మదిన వేడుకలు

**హైదరాబాద్, అక్టోబర్ 15 (జనంసాక్షి):**
రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టె సంతోష్ కుమార్ జన్మదినం సందర్భంగా హైదరాబాద్ లో నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేముల వీరేశం శాలువా కప్పి సంతోష్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న జగన్మోహన్, వలిగొండ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గంగుల వెంకట రాజిరెడ్డి, రామన్నపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గరికె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మండలంలో పలువురిని పరామర్శనున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్

నూతనకల్, అక్టోబర్ 15( జనంసాక్షి)



మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిషోర్ కుమార్ శుక్రవారం నూతనకల్ మండలంలో పర్యటించి పలువురుని పరామర్శించనున్నారు. ఈ సందర్భంగా లింగంపల్లి, ఎర్రపహాడ్ గ్రామాలలో పర్యటించి బాధిత, కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. ఉదయం 10:30 గంటలకు లింగంపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు దేశపంగు మధు తండ్రి దేశపంగు గురువయ్య ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఎర్ర పహాడ్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు, పార్టీ సీనియర్ నాయకుడు గాడుదుల అవిలయ్య యాదవ్ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోనున్నారు. ఈ కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సకాలంలో హాజరై పాల్గొనాలని నూతనకల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# సాయిసన్నిధిలో వైభవంగా లలితా త్రిపురసుందరీ అవతారం..

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..**
**కరాటే కళ్యాణి హరికథా గానంతో**
**భక్తులకు ఆధ్యాత్మిక విందు..**



**చింతపల్లి, అక్టోబర్ 15(జనంసాక్షి)**
చింతపల్లి మండల కేంద్రంలోని సాయి సన్నిధిలో ఉదయం 10 గంటలకు కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం సాయిబాబాకు మధ్యాహ్న హారతి సమర్పించిన తర్వాత 108 కలశాలతో చక్కెర అభిషేకం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని సాయినాథుని ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తుల సాయినామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

**కరాటే కళ్యాణి హరికథా గానం ప్రత్యేక ఆకర్షణ**
అనంతరం ప్రముఖ సినీనటి, హరికథా చూడామణి, శ్రీ ఆదిపట్ల శ్రీ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి కరాటే కళ్యాణి ఆధ్వర్యంలో శ్రీ వల్లి కళ్యాణం హరికథా గానం నిర్వహించారు. భక్తి భావాన్ని పెంపొందిస్తూ సాగిన హరికథా కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. భగవంతుని లీలలు, ఆధ్యాత్మిక సందేశాలతో కూడిన హరికథను భక్తులు ఆసక్తిగా ఆలకించారు. శ్రీ సాయిసన్నిధిలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో ఆలయంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మంచికంటి ధనంజయ, ఆలయ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## సమగ్ర వ్యవసాయ వ్యవస్థపై కల్పించిన విద్యార్థులు

**చింతలపాలెం(జనంసాక్షి)**
దొండపాడు గ్రామంలో గ్రామీణ వ్యవసా య పని అనుభవ కార్యక్రమంలో భాగంగా గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాల(అటానమస్) విద్యార్థినులు రైతులకు సమగ్ర వ్యవసాయ వ్యవస్థపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర వ్యవసాయ వ్యవస్థ వివరిస్తూ నమూనా ద్వారా ప్రదర్శన నిర్వహించా రు.సమగ్ర వ్యవసాయ వ్యవస్థ అంటే ఒకే వ్యవసాయ క్షేత్రంలో పంటల సాగు, పశు పోషణ,కోళ్ల పెంపకం,చేపల పెంపకం,కూరగాయల సాగు,పండ్ల తోటలు వంటి వివిధ వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలను కలిపి చేపట్టడం.మనం సాధారణంగా ఒక పంటను మాత్రమే సాగు చేస్తుంటాం. వర్షాలు సరిగా పడకపోయినా,పంటకు తెగుళ్లు వచ్చినా లేదా మార్కెట్‌లో ధర తగ్గినా మనకు నష్టం కలుగుతుంది.అదే మన పొలంలో పంటల సాగుతో పాటు పాడి పశువులు,కోళ్లు,కూరగాయలు, పండ్ల మొక్కలు,నీటి వనరులు ఉంటే ఒక రంగంలో నష్టం వచ్చినా మరొక రంగం నుంచి ఆదాయం పొందవచ్చు అని వివరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినులు లోరా జాస్మిన్,శ్రావణి, జాయ్సి,లాస్య మరియు జాహ్నవి పాల్గొని సమగ్ర సస్యరక్షణ పద్ధతులను రైతులకు మోడల్ ద్వారా వివరించారు.



## వినియోగదారుల మన్ననలు పొందాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో గల మహాత్మా గాంధీ విగ్రహానికి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన గర్ల్స్ అండ్ గైస్స్ ది ఫ్యాషన్ స్టూడియోను ఆమె ప్రారంభించి మాట్లాడారు.ప్రస్తుత రోజుల్లో వస్త్రధారణకు మంచి క్రేజ్ పెరుగుతుందన్నారు.ప్రస్తుత ట్రెండ్ అండ్ క్రేజ్ కు అనుగుణంగా అన్ని విభాగాలలో వినియోగదారులకు వస్త్ర సేవలను అందించి ఆదరణ పొందాలని, వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.గర్ల్స్ అండ్ గైస్స్ ది ఫ్యాషన్ స్టూడియో ద్వారా సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు వస్త్ర రంగంలో సంప్రదాయ, ఆధునికత కలయికతోనూతన ట్రెండింగ్ కలెక్షన్స్ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీవుల్లా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ వెలుగు వెంకన్న, కౌన్సిలర్ గుణగంటి హేమ సతీష్, నాయకులు చింతలపాటి చిన్నశ్రీరాములు, వెంపటి గురూజీ,బొజ్జ ఎడ్వర్డ్, నిర్వాహకులు బొజ్జ జ్యోతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### గట్టు అజయ్ ఇంటి నిర్మాణానికి 15 బస్తాల సిమెంట్ అందజేత

**ఆత్మకూర్ (ఎం)జనంసాక్షి అక్టోబర్ (15)**
మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన గట్టు అజయ్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, సరస్వతి విద్యాలయం కరస్పాండెంట్ తౌర్ర విష్ణు 15 బస్తాల సిమెంట్ అందజేశారు. వార్డు సభ్యులు రాగటి మత్స్యగిరి, కూరెళ్ల అనిల్ ఆధ్వర్యంలో ఈ సహాయం అందించారు. ఈ సందర్భంగా అజయ్ తన కుటుంబానికి అండగా నిలిచిన తౌర్ర విష్ణుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాలయం ప్రిన్సిపాల్ పంజాల నర్సయ్య గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.





## అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్న నీలకంఠం లింగస్వామి విజయ దంపతులు

**అమ్మవారికి ముక్కుపుడక సమర్పణ, లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరణలో ఘనంగా పూజలు**

**చిట్యాల, అక్టోబర్ 15 (జనంసాక్షి):**
చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామంలో శ్రీ తిరుమల స్వామి యువజన సంఘం ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి / శ్రీ దుర్గామాతకు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆరవ వార్డు నెంబర్ నీలకంఠం లింగస్వామి విజయ దంపతులు మొదటి రోజు అమ్మవారికి ముక్కుపుడక సమర్పించి నేడు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పసుపు, కుంకుమ, పూలతో అభిషేకం చేసి, మహా హారతి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మోర రామరాజు నూతి తిరుమలేష్ మోర నరేష్ ఏదుళ్ళ శ్రీనివాస్ రెడ్డి యాట లింగస్వామి యాట వేణు నూతి వెంకటేష్ మోర సురేష్ గోపగోని హరీష్ గోపగోని కార్తీక్ మరియు భవాని మాలన దారులు గ్రామ భక్తులు, మహిళా సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మ వారి దయతో గ్రామం సుభిక్షంగా, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ కూడా చేశారు.



**నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు మరియు తోటి నల్లగొండ జిల్లా మండల విద్యాధికారులతో పాటు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పి.ఏ.పల్లి,గుడిపల్లి మండలాల విద్యాధికారులైన ధన్నె రాజు,సముద్రాల శీనయ్య లు పాల్గొన్నారు.**

**జనంసాక్షి ఏపి.ఏ.పల్లి**



## దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దేవి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారు మహాచండీదేవి గా భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా దేవాలయంలో నవీన్ శర్మ అవధాని ఆధ్వర్యంలో మహా చండీయాగం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాచండీ యాగం దుర్గాదేవి అనుగ్రహం కోసం నిర్వహించే అత్యంత శక్తివంతమైన ఆధ్యాత్మిక క్రతువు అని తెలిపారు.లోక కల్యాణం కోసం, సమాజంలో శాంతి సౌఖ్యాలు వర్ధిల్లాలని, శత్రు, గ్రహ దోష నివారణల కోసం ఈ యాగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారని తెలిపారు.మహా చండీయాగం ద్వారా విశేష ఫలితాలు లభిస్తాయని తెలిపారు.దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు సింగిరికొండ సురేందర్, ప్రధాన కార్యదర్శి ఈగ వెంకటేశ్వర్లు, కోశాధికారి పోలా రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు సింగిరికొండ రవీందర్, తల్లాడ సోమయ్య, చల్లా లక్ష్మయ్య, ఈగ రామయ్య, గుండా శ్రీధర్, చిలుకల శ్రీనివాస్, వెంపటి శబరినాథ్, పబ్బతి వేణుమాధవ్, కలకోట లక్ష్మయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ను పరామర్శించిన ఎమ్మెల్యే వేముల

రామన్నపేట, అక్టోబర్ 15 (జనంసాక్షి):
రామన్నపేట సర్పంచ్ గరికె సత్యనారాయణకాలికి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలతో భరోసా

## గుండాలలో స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**గుండాల, అక్టోబర్ 15 (జనంసాక్షి):**
అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి?షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు కార్డులు, చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవడంతో పాటు పేద కుటుంబాలకు భరోసా కల్పించడమే లక్ష్యమని అన్నారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాల సమయంలో ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు



ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రజా సంక్షేమంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, పేద కుటుంబాల అభ్యున్నతికి తోడ్పడటం, గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గుండాల ఎంఆర్ఓ సంగీత, ఎంపీడీవో బాలరాజు, హౌసింగ్ ఏఈ రాజేష్, ఏవో వెంకటరమణ, ఎంపీవో త్రిలోక్, పంచాయతీ సెక్రటరీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పొంబోయిన ముత్తయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్కే ఖదీర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఊకె బుచ్చయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధార అశోక్, పడుగొనిగూడెం సర్పంచ్ ఈసం సంజీవరావు, రోళ్లగడ్డ సర్పంచ్ బూక్య మంగమ్మ, శెంబునిగూడెం సర్పంచ్ ఈసం సుమలత, శెట్టుపల్లి సర్పంచ్ ఢిల్లీ వసంతరావు, దామరతోగు సర్పంచ్ కల్తి కృష్ణారావు, మాజీ ఎంపీపీ చాట్ల పద్మ, మండల నాయకులు ఎస్కే అబ్దుల్ నభి, వంకుడోత్ బీకోజీ, బూక్య శ్రీను, ఎస్కే వాజీద్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు



## ప్రముఖ కవి బుక్క సత్యనారాయణకు, సాహితీసేవ, పురస్కారం

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 15 (జనంసాక్షి)**
ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గజల్ గాయకుడు, గజల్ శ్రీనివాస్, 50 వసంతాల సంగీత ఉత్సవం ,40 వసంతాల గజల్ గాన వేడుకలు, 60 వసంతాల తెలుగు గజల్ కు నీరాజనం, మహోత్సవం, గుంటూరు భారతీయ విద్యా భవన్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను గజల్ చారిటబుల్ ట్రస్ట్ , ఆంధ్ర ప్రదేశ్ భారతీయ విద్యా భవన్ సంయుక్త ఆధ్వర్యంలో, నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సభా వేదికపై ప్రముఖ కవి, రచయిత ,నంది అవార్డు గ్రహీత, సామాజిక సేవకులు, డాక్టర్ బుక్కా సత్యనారాయణకు, సాహితీ సేవా పురస్కారం , శాలువతో సత్కరించి ప్రశంసా పత్రం , విశిష్ట పురస్కార జ్ఞాపికను, అందజేశారు. సత్యనారాయణ తెలుగు భాష కనుమరుగవుతున్న దశలో తోటి కవులను రచయితలను సంఘటిత పరుస్తూ సాహిత్య కార్యక్రమాలలో, సామాజిక కార్యక్రమాలలో తన వంతు కర్తవ్యాన్ని పోషిస్తూ సత్యనారాయణ ఆదర్శంగా నిలవటమే కాకుండా, అనేకమంది ప్రముఖులతో అవార్డులతో, రివార్డులతో, సత్కార సన్మానాలను పొందారు. ఈ సేవలు అన్నిటిని గుర్తించి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గజల్ నాయకుడు మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా సాహితీసేవ పురస్కారం లభించింది. ఈ గౌరవాన్ని అందించిన డాక్టర్ గజల్ శ్రీనివాస్, గజల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు , గజల్కవులకు,గాయకులకు, ముక్కసత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు.



## ఆర్థిక సహాయం అందజేత

**బీబీనగర్ (జనంసాక్షి ):**
బీబీనగర్ మండలం రాఘవపురం గ్రామానికి చెందిన కోర్ని పెద్ద బస్వయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా గురువారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి, వారికి ఆర్థిక సహాయం అందజేశారు. పిఏసిఎస్ ఛైర్మన్ పొట్టోళ్ల శ్యామ్ గౌడ్ ఐదు వేలు గ్రామ సర్పంచ్ సిద్దగోని శ్రీకాంత్ గౌడ్ మూడు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తోరుపునూరి రవి గ్రామ శాఖ అధ్యక్షులు మేకల కుమారస్వామి, కోర్ని మైసయ్య, మేకల బాలయ్య, కోర్ని చంద్రయ్య, అంబటి చంద్రయ్య, బియ్య బస్వయ్య, న్యాలపట్ల జ్ఞానేశ్వర్,కోర్ని గణేష్, పొట్టోళ్ళ అశోక్, రక్తని మల్లేష్, కోర్ని బస్వయ్య, కోర్ని జంగయ్య, కోర్ని పాండు, కోర్ని చిన్న చంద్రయ్య, కోర్ని రాములు, కోర్ని వెంకటేష్, కోర్ని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లలిత త్రిపుర సుందరి దేవిగా కనకదుర్గమ్మ మహిళల కుంకుమార్చనలు

**చిట్యాల , అక్టోబర్ 15(జనం సాక్షి):**
చిట్యాల పట్టణంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో నవరాత్రి దసరా నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా జరుగుచున్నాయి. దీనిలో భాగంగా 5వ రోజు గురువారం అమ్మవారు శ్రీలలిత సుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. దద్దోజనం, క్షీరాన్నం ను ప్రసాదముగా అమ్మవారికి సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేసి కుంకుమ పూజలు చేశారు. అష్టోత్తర శతనామావళి పఠించారు. ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ నేతృత్వంలో అర్చకులు



వాసుదేవ శర్మ పూజలు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ పందిరి గీతా రమేష్ హాజరయ్యారు. దేవస్థానం కమిటీ డైరెక్టర్లు వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, వరకంత నరసింహారెడ్డి, రుద్రారపు లింగస్వామి, జిట్ట సాయిలు, బెలిద సత్యనారాయణ, ఏళ్ల మాధవి బయ్యన్న, కమ్మర దేవి రవి, ఆలయ అధికారి ఏనుగు నరసింహారెడ్డి పాల్గొన్నారు. అర్చక బృందం.. గోవింద్ మిశ్రా, సత్యం మిశ్రా, దుర్గేష్ శుక్ల, శుభం మిశ్రా, పవన్ శర్మ లు కూడా పూజాదికాలలో పాల్గొన్నారు. మహిళా భక్తులు, సేవకులు రేగొండ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ లలిత త్రిపుర సుందరి దేవిగా దర్శనం ఇచ్చిన దుర్గామాత

**హాలియా జనం సాక్షి అక్టోబర్ 15**
శ్రీదేవి శరన్న నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత గురువారం దుర్గామాత గురువారం నాడు భక్తులకు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు హాలియా సాయి మందిరంలో ఆలయ అర్చకుడు మనోజ్ పాండే ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చీదళ్ళ లింగయ్య దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురవాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తేలపోలు శేఖర్ సక్రు నాయకు. శివకుమార్ మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## లోయపల్లి లో మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):**
అర్వపల్లి మండలంలోని లోయపల్లి గ్రామానికి చెందిన గెండెల ధనుంజయ ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో గ్రామస్తులు కొంతమంది గురువారం మృతుడి కుటుంబీకులకు రూ. 12 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోదల శ్యాంసుందర్ రెడ్డి, ఆరె జనార్ధన్, సైదులు, పి.లింగయ్య, నర్సయ్య, సైదులు, అల్దాస్ లింగయ్య, రవి, వెంకటేశ్వర్లు పాల్గొ?న్నారు.

## రాక్‌వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు

**బీబీనగర్ (జనంసాక్షి):**
యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం లక్ష్మీదేవి గూడెం పరిధిలోని రాక్‌వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేలా బతుకమ్మ పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటపాటలతో సందడి చేశారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పూల పండుగ గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఇలాంటి





కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి పట్ల గౌరవం, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందుతుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రామనాయుడు, సీఈఓ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ శ్రీరంజని పాల్గొన్నారు.

# ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష

### ఈనెల 22న కలెక్టరేట్ వద్ద సర్పంచులతో కలిసి ఆందోళన



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 15 (జనంసాక్షి):** ఇందిరమ్మ పథకం లబ్దిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష చూపు తున్నారని నిజమైన లబ్దిదారులకు అన్యాయం జరుగుతుందని విపక్షాలు ఆరో పించాయి. లబ్దిదారుల జాబితా తయారు చేసి లాటరీ పద్ధతిలో లబ్దిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశాయి. సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, సిపిఐ (ఎంఎల్)మాస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల -సంయుక్త సమావేశం గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇందిరమ్మ పథకం లబ్దిదారుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరైంది కాదని కండువ కప్పుకున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలనే లబ్దిదారులుగా ఎంపిక చేస్తున్నారని సమావేశంలో పాల్గొన్న నేతలు -ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నియమ నిబంధనలను పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ కార్యకర్తలు ఇచ్చిన జాబితా లనే యథాతథంగా ఆమోదిస్తున్నారని అధికారులు ఆ జాబితాలో అనర్హులు ఉన్నా పట్టించు కోవడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ తీరు మార్చు కోవాలని సూచించారు. ఈ నెల 22న సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో ఆందోళన నిర్వహించా లని సమావేశం నిర్ణయించింది. ఈనెల 22న కలెక్టరేట్ ఎదుట జరిగే ఆందోళనకు పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో ఎంఎల్సి తాతా మధుసూదన్, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జెడ్పి మాజీ ఛైర్మన్ లింగాల కమల్రాజు, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ న్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, వివిధ పక్షాల నేతలు యర్రా బాబు, బెల్లం వేణు, ఆవుల అశోక్, శింగు నర్సింహారావు, పర్సా రాంచంద్రరావు, బానోత్ కొండ, శివరామకృష్ణ, తాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## జవాహర్ బాల్ మంచ్ జిల్లా ఛైర్మన్‌గా పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి

### శ్రీనివాసరెడ్డికి కీలక బాధ్యతలు



**బూర్గంపహాడ్ అక్టోబర్ 15 (జనంసాక్షి)** జవాహర్ బాల్ మంచ్ ప్రొబేషనరీ జిల్లా ఛైర్మన్‌గా సారపాక గ్రామానికి చెందిన పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. జవాహర్ బాల్ మంచ్ తెలంగాణ రాష్ట్ర ఛైర్మన్, న్యాయవాది మామిడి రిషికేష్ రెడ్డి అక్టోబర్ 15న జారీ చేసిన కార్యాలయ ఉత్తర్వుల్లో ఈ విషయాన్ని వెల్లడించారు. జాతీయ సమన్వయకర్త ఆయన నియామకానికి ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డికి రాష్ట్ర ఛైర్మన్ అభినందనలు తెలియజేశారు. భారత రాజ్యాంగ పరిరక్షణతో పాటు జవాహర్ బాల్ మంచ్, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. భావి తరాల పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించే లక్ష్యంతో అందరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఈ బాధ్యతకు ఎంపికైన శ్రీనివాసరెడ్డికి జవాహర్ బాల్ మంచ్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# రంగాపురం వద్ద లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి..

### దర్యాప్తు కోరుతూ సోదరుడి ఫిర్యాదు

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 15 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగాపురం సమీపంలో ఓ లారీ డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు వివరాల ప్రకారం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్‌పూర్‌కు చెందిన నఖత్ రామ్ (41) గత కొన్ని నెలలుగా మోతీలాల్ జైన్‌కు చెందిన లారీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 12న ఎన్ఎండీసీ నగర్‌నార్ నుంచి హెచ్ఆర్ కాయిల్స్ లోడుతో తమిళనాడుకు బయలుదేరిన ఆయన, తిరుగు ప్రయాణంలో ఖాళీ లారీతో జగదల్‌పూర్‌కు వస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగాపురం ప్రాంతంలో లారీ చాలాసేపు నిలిచిపోయినట్లు జీపీఎస్ ద్వారా లారీ యజమాని గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం పలుమార్లు ఫోన్ చేసినా డ్రైవర్ స్పందించకపోవడంతో పాల్వంచకు చెందిన తన పరిచయస్తులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, లారీలో నఖత్ రామ్ మృతిచెంది ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నఖత్ రామ్ గుండెపోటుతో మృతి చెందినట్లు అనుమానం ఉన్నప్పటికీ, అసలు కారణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజానిజాలు వెలికితీసి తమకు న్యాయం చేయాలని మృతుడి సోదరుడు నారాయణ్ రాయ్ పాల్వంచ రూరల్ పోలీసులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతే కీలకం

- తేమశాతం తప్పనిసరిగా పరిశీలించాలి..
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయొద్దు.
- జీసీసీ డీఎం రామానందం సూచన..



**భద్రాచలం అక్టోబర్ 15 (జనంసాక్షి)** ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు విక్రయానికి తీసుకొచ్చే వరి ధాన్యాన్ని నిర్దేశిత నాణ్యతా ప్రమాణాల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని జీసీసీ డీఎం రామానందం సూచించారు. ముఖ్యంగా ధాన్యంలో తేమశాతాన్ని కచ్చితంగా నిర్ధారించాలని, తడిసిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయవద్దని స్పష్టం చేశారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జీసీసీ మేనేజర్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధాన్యం సేకరణలో నాణ్యతా ప్రమాణాలు, తేమశాతం నిర్ధారణ, సాంకేతికంగా ధాన్యాన్ని పరిశీలించే విధానాలపై అవగాహన కల్పించారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ధాన్యాన్ని పైపైన పరిశీలించి కొనుగోలు చేయకుండా అన్ని ప్రమాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని రామానందం సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే సేకరించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసే సమయంలోనూ తగిన జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించే ప్రతి దశలోనూ నిర్దేశిత సాంకేతిక విధివిధానాలను తప్పనిసరిగా అనుసరించాలని పేర్కొన్నారు. అనంతరం పౌర సరఫరాల శాఖ సాంకేతిక ఇన్‌చార్జి సతీష్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే నాణ్యత, తేమశాతాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. ధాన్యం నాణ్యతను నిర్ధారించే పద్ధతులు, కొనుగోలు సమయంలో గమనించాల్సిన సాంకేతిక అంశాలను దృశ్య ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ మేనేజర్ సమ్మయ్య, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చెందిన 30 మంది ఇన్‌చార్జిలు, జీసీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన

### శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి అవతారంలో దుర్గాభవాని

### భక్తులతో కిటకిటలాడిన శివాలయ ప్రాంగణం



**చింతపల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి)** చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం (శివాలయం) వద్ద శ్రీ దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. 200 మందికి పైగా మహిళలతో కుంకుమార్చన కొమిరిశెట్టి చంద్రకళ వెంకటయ్య ఆధ్వర్యంలో 200 మందికి పైగా మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణం అంగరంగ వైభవంగా సాగింది. వేద మంత్రాల పఠనం, అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు సమర్పించి కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థించారు.

**వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం**

దుర్గామాత ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి అవతారంలో అమ్మవారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భవాని గురుస్వామి చెనమోని రాములు, ఎల్లంకి రవికుమార్, గోవిందు రవికుమార్, గోవిందు ప్రసాద్, సోమరాజు ప్రదీప్, కుందేళ్ల చెన్నయ్య, కుంభం శ్రీనివాస్ రెడ్డి, చింతకాయల అంజి, ఎర్ర చిన్న, ప్రసాద్, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు...



## గ్రామాభివృద్దే ధ్యేయంగా కృషి

**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 15 (జనంసాక్షి)** గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు సూర్యానాయక్ తండా సర్పంచ్ లూనావత్ కృష్ణానాయక్ తెలిపారు. తండాలో అన్ని వీధుల నందు గురువారం వీధిలైట్లు వేయించే కార్యక్రమాన్ని చేపట్టారు. తాను సర్పంచ్ అయ్యాక తండాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నర్సింహ, బిక్కు, బుజ్జి, బద్రు, వీరన్న, వెంకటేష్, గ్రామస్తులు నాగులు, సోమాని, బిక్కు, భీమా, లాలు తదితరులు పాల్గొన్నారు.

# అరణ్యకాండ పారాయణంతో ఆధ్యాత్మిక సందేశం

### శ్రీరామ నామస్మరణతో శాంతి, ధైర్యం.. ధర్మమార్గంలో నడిచేందుకు స్ఫూర్తి





**భద్రాచలం అక్టోబర్ 15 (జనంసాక్షి)** శ్రీరామ నామమే మనకు శాంతిని, ధైర్యాన్ని ప్రసాదించడంతో పాటు ధర్మమార్గంలో నడిచే స్ఫూర్తిని కలిగిస్తుందని వక్తలు పేర్కొన్నారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీరామాయణ మహాపారాయణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాలుగో రోజు అరణ్యకాండ పారాయణాన్ని పఠించి శ్రీరాముని ఆదర్శాలను స్మరించుకున్నారు. ఈ పారాయణంలో పాల్గొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వక్తలు అరణ్యకాండలోని ఘట్టాలను పఠిస్తూ వాటిలోని ధర్మసూత్రాలను వివరించారు. కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యాన్ని కోల్పోకూడదని, అన్యాయాన్ని సహించకుండా ధర్మాన్ని కాపాడాలని, కుటుంబ బంధాలను గౌరవించాలని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని రామాయణం బోధిస్తుందని తెలిపారు. అధర్మం ఎంతటి శక్తిమంతంగా కనిపించినా చివరకు ధర్మమే విజయాన్ని సాధిస్తుందనే విశ్వాసాన్ని శ్రీరాముని జీవితం కలిగిస్తుందన్నారు. శ్రీరాముని ఆదర్శాలు, సీతమ్మవారి సహనం, లక్ష్మణస్వామి సేవాభావం, జటాయువు త్యాగం, శబరి భక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రామాయణంలోని ఘట్టాలను తెలుసుకోవడంతో పాటు వాటిలోని నీతిని నిత్యజీవితంలో ఆచరించాలని సూచించారు. శ్రీరామ నామస్మరణతో సకల జనులకు శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని, ధర్మమార్గంలో నడిచే శక్తిని స్వామివారు ప్రసాదించాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయితో పాటు వైదిక సిబ్బంది, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వక్తలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలి

○కొళాయి నీటిని వృథా చేస్తే కనెక్షన్లకు డమ్మీలు వేస్తాం ?

○మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణ రెడ్డి

**కల్లూరు అక్టోబర్ 15(జనంసాక్షి)**

ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో, కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ త్రాగు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయం లో కమిషనర్ విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని గృహాలకు నల్లా (ట్యాప్) కనెక్షన్ల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిని ప్రజలు అవసరమైన మేరకే వినియోగించుకోవాలని, నీటిని వృథాగా నేలపై పారబోయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నీటి బొట్టును విలువైనదిగా భావించి, నీటి పొదుపును ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించాలని కోరారు.ముఖ్యంగా, నల్లా కనెక్షన్లు ఉన్న గృహాల యజమానులు నీటిని అవసరానికి మించి వదలకుండా, నీరు వినియోగించిన వెంటనే నల్లాను మూసివేయాలని తెలిపారు. నీటిని ఆన్?ఆఫ్ చేసుకునే సదుపాయం కలిగిన ట్యాప్‌లను ఏర్పాటు చేసుకుని వినియోగించాలని సూచించారు. ట్యాప్‌లను తెరిచి ఉంచడం వల్ల తాగునీరు వృథాగా ప్రవహించి ఇతర ప్రాంతాల ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.మున్సిపాలిటీ నుంచి సరఫరా అవుతున్న నీటిని వృథాగా వదిలే కనెక్షన్లను గుర్తించి, నిబంధనల ప్రకారం చర్యలు




తీసుకోవడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో అట్టి నల్లా కనెక్షన్లకు డమ్మీలు వేయడం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించారు. ప్రజలు మున్సిపాలిటీకి సహకరిస్తూ తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణ రెడ్డి కోరారు.




## ఖమ్మం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి..

**ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు డిమాండ్**

**చింతకాని, అక్టోబర్ 15 (జనంసాక్షి):**

గురువారం చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో ఏఐకేఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఖమ్మం జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, తక్షణమే ఖమ్మం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఇప్పటికే ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టినప్పటికీ, వర్షాభావంతో పంటలు చేతికొచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని, సన్న వడ్లకు ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా మద్దతు ధర పెంచాలని కోరారు. అలాగే కౌలు రైతులను గుర్తించి వారికి తక్షణమే ప్రభుత్వ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూచిపూడి రవి, మండల అధ్యక్షుడు దొబ్బల వెంగళరావు, సీపీఐ శాఖ కార్యదర్శి నీరుడు గోవిందరావు, సహాయ కార్యదర్శి చల్లగుండ్ల సాయి, నాయకులు నారపోగు నాగార్జున, అనిల్, మాజీ ఉపసర్పంచ్ కోటగిరి ప్రభూషణాచారి, కూచిపూడి వెంకటేశ్వర్లు, నూకల నాగయ్య, జనగాం వెంకటే శ్వర్లు, ఖాదర్ బాబు, నారపోగు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

**- ఐద్వా ఆధ్వర్యంలో ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు**

**భద్రాచలం అక్టోబర్ 15 (జనంసాక్షి)**

భద్రాచలంలో ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను మహిళలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ మహిళల హక్కులు, సమానత్వం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి. సీతాలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లలకు భయం లేని సమాజాన్ని నిర్మించాలని, మహిళలపై హింస, వివక్షను అరికట్టాలని కోరారు. రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బతుకమ్మ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని గెలిచేది బిజెపి ఏ

జిల్లా ఇన్చార్జి బద్దం మహిపాల్ రెడ్డి..

**పెనుబల్లి అక్టోబర్ 15 (జనం సాక్షి)**

పెనుబల్లి మండలం వి.ఎం బంజర్ సప్తపది ఫంక్షన్ హాల్ లో గురువారం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు అధ్యక్షతన సత్తుపల్లి నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం జిల్లా ఇన్చార్జి బద్దం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని బిజెపి పార్టీ గెలవబోతుందని అన్నారు. చదువుకున్న పట్టభద్రులందరూ ఈసారి భారతీయ జనతా పార్టీ అభ్యర్థికి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరు రామలింగేశ్వరావు, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల వీరంరాజు ,జిల్లా కార్యదర్శి పాల నాగ సురేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఓటర్ ఎన్రోల్మెంట్ నియోజకవర్గ కన్వీనర్ పర్సా రాంబాబు, పెనుబల్లిమండల అధ్యక్షులు బొర్రా నరసింహారావు, కల్లూరు తల్లాడ సత్తుపల్లి వేంసూరు మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

**భద్రాచలం అక్టోబర్ 15 (జనంసాక్షి)**



భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీరామ సేవా మండపంలో సీతారామచంద్ర స్వామివారిని సుందరంగా అలంకరించి సింహాసనంపై ఆసీనులను చేశారు. అనంతరం కల్యాణ వేడుకల్లో భాగంగా విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల సమర్పణ, వేద ఆశీర్వచనం తదితర క్రతువులను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ నిత్య కల్యాణ వేడుకలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## నాగులపాటి అన్నారం బ్రిడ్జి కనకదుర్గమ్మ ఆలయంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

**పూజాకార్యక్రమంలో పాల్గొన్న తండు ఎల్లయ్య కుటుంబ సభ్యులు**

**పెన్ పహాడ్, అక్టోబర్ 15 (జనం సాక్షి) :**

మండల పరిధిలోని నాగులపాటి అన్నారం బ్రిడ్జి గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.గ్రామానికి చెందిన దాతలు తండు ఎల్లయ్య నాగమ్మ, తండు వెంకన్న భవాని, తండు పరశురాం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఈ సందర్భంగా దాతలు తండు ఎల్లయ్య, నాగమ్మ తండు వెంకన్న భవాని లను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుందరి రామారావు, యగ్గడి మధువర్మ, గర్నె వెంకన్న,రవి, రంగయ్య,మేకల అంతయ్య, చెరుకు ఉపేందర్, యగ్గడి పురుషోత్తం ,కటకం వెంకన్న,ముదిగొండ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



# టేకు చెట్లు నరికిన సంఘటనలో కారకులైన అందరి పైన కేసు నమోదు చేయాలి

## రవాణా చేసిన ట్రాక్టర్ ను కూడా సీజ్ చేయాలి

**కల్లూరు అక్టోబర్ 15(జనం సాక్షి)**

ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న టేకు చెట్లను అనుమతులులేకుండా నరికి రవాణా చేసిన వ్యక్తుల అందరి పైన కేసు నమోదు చేసి రవాణా చేసిన టాక్టర్ సీజ్ చేసి సమగ్ర విచారణ జరిపి కఠిన చర్య తీసుకోవాలని టిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ డిమాండ్ చేసింది. గురువారం కల్లూరు లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ జడ్పిటిసిలు కట్ట అజయ్ కుమార్ లక్కినేని రఘు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు కూడా ఈ ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. చెట్లు నరికిన వ్యక్తి పైన ఎండిఓ పైన కేసు నమోదు చేసి చెట్లు నరికిన సంఘటనలో మిగతా కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఒక రైతు తన పొలంలో ఉన్న చెట్టును కొట్టుకోవాలంటేనే ఫారెస్ట్ అధికారులు చుట్టూ తిరిగి అనుమతులు తీసుకొని చాలా నా కట్టి , నరకటానికి రవాణాకి అనుమతులు తీసుకుని అప్పుడే నరకడానికి అనుమతిస్తారని. ఇక్కడ ఒక ప్రభుత్వ కార్యాలయంలో ఉన్న చెట్లను నరికితే ఈ నిబంధన పాటించరా అని వారు ప్రశ్నించారు. ప్రైవేటు వ్యక్తి అక్రమ రవాణా చేస్తే రవాణా చేసిన టాక్టర్ ని కూడా చీజ్ చేస్తారు. అలాంటప్పుడు కలపని రవాణా చేసిన ట్రాక్టర్ ను ఎందుకు సీజ్ చేయలేదని అటవీ శాఖ అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు విచారణ సమగ్రంగా విచారణ చేపట్టి అసలైన వ్యక్తులపైన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు



పెడకంటి రామకృష్ణ,ఎండి ఇస్మాయిల్, మాజీ జెడ్పిటిసి మేకల కృష్ణ మాజి సొసైటీ చైర్మన్లు పెద్ద బోయిన మల్లేశ్వరరావు, కాటమనేని వెంకటేశ్వరరావు, నాయకులు రావి సూర్యనారాయణ, ఇంతిహాస్, కనపర్తి రాజకుమార్, పుసులూరు శ్రీనివాసరావు, రఘునాథ గూడెం మాజీ సర్పంచ్లు కావేటి నరసయ్య , కుక్క అంజన్ రావు బానోత్ కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో ఘనంగా 'స్వాతి గ్రాండ్ రెస్టారెంట్' ప్రారంభం

## స్వాతి గ్రాండ్ రెస్టారెంట్ హోటల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే సాంబశివరావు మేయర్ గణేష్





**పాల్వంచ (జనంసాక్షి):** పట్టణంలో నూతనంగా 'స్వాతి గ్రాండ్ రెస్టారెంట్' అత్యంత వైభవంగా ప్రారంభమైంది. స్వాతి గ్రాండ్ రెస్టారెంట్ ను స్థానిక ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, కొత్తగూడెం మేయర్ మూడు గణేష్ , బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేంద్ర రావు రిబ్బన్ కట్ చేసి గురువారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పట్టణంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. కార్పొరేటర్ బత్తుల మధుచంద్, ముక్తేవి ఫౌండేషన్ చైర్మన్ ముక్తే గిరీష్, రేగళ్ల శ్రీను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. అతిథులకు ఘనంగా స్వాగతం పలికిన అనంతరం, పట్టణంలోని ప్రముఖులందరినీ నిర్వాహకులు రంగారావు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధరలు ఉన్నాయని, రుచికరమైన నాణ్యమైన వంటకాలు ప్రజలకు అందిస్తున్నారని అందులో 'స్వాతి గ్రాండ్ రెస్టారెంట్' ముందంజలో ఉంటుందని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఇక్కడ లభించే చికెన్ బిర్యానీ, మండి రుచులు ప్రజలను అలరిస్తాయని తెలిపారు. రెస్టారెంట్ యజమానికి హోటల్ వ్యాపారంలో 30 సంవత్సరాల అనుభవం ఉండటం ఈ రెస్టారెంట్ విజయానికి ఒక ప్రధాన కారణమని వారు పేర్కొన్నారు. పట్టణ ప్రజలందరికీ రుచికరమైన మరియు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తాము కట్టుబడి ఉన్నామని రెస్టారెంట్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సాబీర్ పాష, కార్పొరేటర్ లు సిరిపురం లలిత, సుగుణ, రాంబాబు, నరేష్, సింధు తపస్వి, నామ కీర్తి, అన్నపూర్ణ, పట్టణంలోని నాయకులు కనగాల బాలకృష్ణ, ఎర్రంశెట్టి ముత్తయ్య, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# ఏడు సన్న ధాన్యం రకాల ధృవీకరణకు ప్రత్యేక చర్యలు?

## జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 15 (జనంసాక్షి)**
వానాకాలం 2026-27 ధాన్యం కొనుగోలు సీజన్ అక్టోబర్ 2026 నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఏడు గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాలను ప్రోత్సహిస్తూ, ఆయా రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ధనసరి పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ సక్రమంగా అందేలా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కొనుగోలు సమయంలో ధాన్యం రకాన్ని సక్రమంగా గుర్తించి, అర్హులైన రైతులకు మాత్రమే బోనస్ ప్రయోజనం అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ మేరకు జిల్లాలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రకాలను గుర్తించడంలో నైపుణ్యం కలిగిన కనీసం ఒక సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఆదేశించిందని, నియమితులయ్యే సిబ్బందికి వ్యవసాయంలో బి.ఎస్సీ లేదా డిప్లొమా విద్యార్హతతో ఉండేలా చూడనున్నామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఈ విధుల్లో పాల్గొనే అర్హత కలిగిన సిబ్బందికి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారితోషికం అందిస్తామన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారి లను సంప్రదించవచ్చున్నారు. నియమిత సిబ్బంది ధాన్యం కొనుగోలు సంస్థలకు సహకరిస్తూ, ప్రభుత్వం గుర్తించిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణ ప్రక్రియలో భాగస్వాములవుతారని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో కోరారు.

# దశాబ్దాలుగా చీకట్లోనే ఆదివాసీల బతుకులు!

**- 40 ఏళ్లుగా మౌలిక వసతుల కోసం ఎదురుచూపులు..**

**- సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్‌కు వినతి..**



**బూర్గంపహాడ్ అక్టోబర్ 15 (జనంసాక్షి):** దశాబ్దాలు గడుస్తున్నా తమ గ్రామాలకు కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంపై ఆదివాసీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారులు, విద్యుత్, మంచినీరు, విద్య, వైద్య సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ డిప్యూటీ కమిషనర్ పి. రమాదేవికి హైదరాబాద్‌లో వినతిపత్రం సమర్పించారు. అశ్వాపురం మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో కోయ ఆదివాసీలు సుమారు 40 ఏళ్లుగా కనీస వసతుల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. బూర్గంపహాడ్ మండలం మోతె గ్రామపంచాయతీ పరిధిలోని చింతకుంట గ్రామంలో సుమారు 40 కుటుంబాలు గత 30 ఏళ్లుగా మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నాయని పేర్కొన్నారు. శ్రీరాంపురం ఎస్టీ కాలనీలోనూ ఇదే దుస్థితి నెలకొందని వివరించారు. విద్యుత్ సౌకర్యం లేక రాత్రివేళ చీకట్లోనే జీవనం సాగిస్తున్నామని, సరైన రహదారులు లేక అత్యవసర సమయాల్లో వైద్య సేవలు పొందడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు అందుబాటులో లేక చిన్నారులు సుమారు ఏడు కిలోమీటర్ల దూరం నడిచి విద్యను అభ్యసించాల్సి వస్తోందని వాపోయారు. తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజాదర్బార్, ఐటీడీఏ, ఎంపీడీవో, కలెక్టర్ కార్యాలయాల్లో పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందని గిరిజనులు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా, మండల అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి, ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్ పి. రమాదేవిని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత్ బహుజన్ ఫ్రంట్ జాతీయ నాయకులు శంకర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాస్ గిరిజనులకు మద్దతుగా నిలిచారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న తమ గ్రామాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, తక్షణమే కనీస వసతులు కల్పించాలని ఆదివాసీలు విజ్ఞప్తి చేశారు.

# 44వ డివిజన్‌లో ప్రజా సమస్యలు గాలికి..

## కార్పొరేటర్ తీరుపై బీఆర్ఎస్ ఇంచార్జి గాంధీ నగర్ దుర్గ తీవ్ర ఆగ్రహం..



**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్15 (జనంసాక్షి):** 44వ డివిజన్‌లో ప్రజలు తీవ్రమైన సమస్యలతో నరకం అనుభవిస్తున్నారని, డివిజన్ కార్పొరేటర్ తీరుపై బీఆర్ఎస్ పార్టీ 44వ డివిజన్ ఇంచార్జి గాంధీ నగర్ దుర్గ తీవ్రస్థాయిలో గురువారం మండిపడ్డారు. ఎన్నికల్లో గెలవడానికి మాత్రమే డివిజన్ కావాలా అంటూ ఆయనను ప్రశ్నించారు. ప్రస్తుతం డివిజన్‌లో కార్పొరేటర్ జాడ ఎక్కడా కనబడటం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమాలు ఆ వ్యాపారాలు: క్రాకర్స్ షాపుల్లో నాటుబాంబులు తయారు చేయించడంలో, కర్రీ పాయింట్‌లో బిజీగా ఉన్నారా? లేదా రోడ్డును ఆక్రమించి, అధికార పార్టీని అడ్డుపెట్టుకొని ట్రాఫిక్ జామ్ చేస్తూ వ్యాపారాలు చేసుకుంటున్నారా? అని నిలదీశారు. పంచాయితీలు, సెటిల్‌మెంట్‌లతోనే కాలం గడుపుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా కుల వివక్ష చూపుతూ ఎస్సీ కాలనీకి రాకపోవడానికి కారణం కుల ఫీలింగా? అని ప్రశ్నిస్తూ, ప్రజల పట్ల వివక్ష చూపవద్దని హితవు పలికారు. డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా తయారైందని, వీధి లైట్లు లేక, కుక్కల బెడదతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కాదన్నారు. వృద్ధులు, వితంతువులు పింఛన్ల కోసం కార్పొరేటర్ జాడ అడుగుతున్నారని తెలిపారు. పార్టీ ఆఫీసుకు వెళ్తే కలవడం లేదని, కర్రీ పాయింట్ వద్ద కస్టమర్లతో నవ్వుతూ గడుపుతూ సామాన్య ప్రజలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగర్వాల్ ప్రాంతానికి వచ్చి ప్రతి వీధిలోని డ్రైనేజీ సమస్యలు, కుక్కల బెడదపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.



# సారధి నగర్‌లో వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు

**280 మంది మహిళలతో ఘనంగా కుంకుమార్చన..**

**మహిళలకు చీరల పంపిణీ**

**ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన ప్రజలకు కృతజ్ఞతలు:**

**మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ**

**ఖమ్మం , అక్టోబర్ 15 (జనంసాక్షి)**
ఖమ్మం నగరంలోని సారధి నగర్‌లో సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 280 మంది మహిళలతో కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ దంపతులు దాతలుగా వ్యవహరించి, పాల్గొన్న మహిళలకు చీరలను బహూకరించారు. ఈ సందర్భంగా కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ మాట్లాడుతూ, ఐదేళ్లపాటు కార్పొరేటర్‌గా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకం, అభిమానం ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజల ఆశీస్సులతో, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో మరింత ప్రజాసేవ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు షేక్ రజ్జి, దయ్యాల నాగేశ్వరరావు, బాల్దే నాగేశ్వరరావు, ఎమ్మే రామకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు పూజారి రాజు, దగ్గు ఆనంద్, అంబటి రామకృష్ణ, మల్యాల లక్ష్మణ్, మన్నే నరేష్, చల్లా సైదులు, హనుమాన్ సింగ్, వంగాల రోహిత్, బైరి లక్ష్మి, దగ్గు జయమ్మతో పాటు పలువురు మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



# ధనలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన లక్ష్మీతాయారు అమ్మవారు



**భద్రాచలం అక్టోబర్ 15 (జనంసాక్షి)**
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీలక్ష్మి తాయారు అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, సహస్రధారాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైదిక, పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు. కాగా, శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తదుపరి అలంకారంలో అమ్మవారు ధాన్యలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

# చంద్రుగొండ ఎస్సైగా డి. విజయకుమారి బాధ్యతల స్వీకరణ

## శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటాం



**చంద్రుగొండ, అక్టోబర్ 15 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా డి. విజయ కుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రజల సహకారంతో చంద్రుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను సమర్థవంతంగా కాపాడేందుకు కృషి చేస్తామని ఎస్సై డి. విజయకుమారి తెలిపారు.